రైతు బేజారు



రైతులు లేక ఖాళీగా ఉన్న స్టాళ్లు

పెదవాల్తేరు రైతుబజారులో సాయంత్రం బేరాలు నిల్

కూరగాయలు పాడైపోతున్నాయని రైతుల దిగాలు

సాయంత్రం బజారు వద్దంటూ వేడుకోలు

బీచ్‌రోడ్డు: ఏ ముహూర్తాన సాయంత్రం రైతుబజారు ప్రారంభించారో గాని.. రైతులకు బేరాలు మాత్రం ఉండటం లేదు. కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. వందల రూపాయలు వెచ్చించి పండించిన తమ పంటలను అమ్ముకునేందుకు రైతుబజారుకు వస్తున్న రైతులకు రోజూ నిరాశే ఎదురవుతోంది. రైతుబజారులో వ్యాపారం చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆనందపడాలో లేక దారి ఖర్చులు కూడా రావడం లేదని బాధ పడాలో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. నగరం నడిబొడ్డున గల పెదవాల్తేరు రైతు బజారులో వ్యాపారాలు సాగిస్తున్న రైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

71 స్టాళ్లు.. 114 మంది రైతులు

పెదవాల్తేరు రైతుబజారులో 71 స్టాళ్లు ఉండగా.. మొత్తం 114 మంది రైతులకు కార్డులు అందజేశారు. వారిలో 66 మంది ఉదయం బజారుకు వచ్చి తమ పంటలను అమ్ముకుంటారు. మిగిలిన 48 మంది రైతులు సాయంత్రం బజారులో వారి పంటలను విక్రయించుకోవాలి. ఉదయం బజారు రైతులకు వ్యాపారం ఉదయం 10.30 గంటలకే అయిపోతుంది. వారి తీసుకొచ్చిన కూరగాయలు చాలా వరకు అమ్ముడవుతున్నాయి. సాయంత్రం బజారుకు వచ్చే రైతులకు మాత్రం కనీస వ్యాపారం కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాడవుతున్న కూరగాయలు

ఎంతో శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడంతో చాలా మంది రైతులు సాయంత్రం బజారుకు రావడం లేదు. వస్తున్న 20 మంది కూరగాయలు కూడా అమ్మలేక పాడై పోతున్నాయని దిగులు చెందుతున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అలా బజారులో ఉన్నప్పటికీ సరైన వ్యాపారం లేక దారి ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.

రద్దీ ప్రాంతమే అయినా..

ఈ బజారు చుట్టుపక్కల పోలీస్ క్వార్టర్లు, ఏయూ క్వార్టర్లు, ఏయూ హాస్టళ్లు, నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులు, పక్కనే పోలీస్ స్టేషన్ వంటివి ఉన్నాయి. అందుబాటులోనే రైతుబజారు ఉన్నప్పటికీ ప్రజలు మాత్రం వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏనాడు బజార్ కిటకిటలాడే పరిస్థితి లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా సాయంత్రం బజారు పూర్తిగా ఖాళీగా దర్శనమిస్తోంది.





సాయంత్రం బజారులో వ్యాపారాలు సాగక ఖాళీగా కూర్చున్న రైతులు

7 నెలలుగా బేరాలు నిల్

పెదవాల్తేరు రైతుబజారులో 7 నెలల నుంచి సాయంత్రం బజారు నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను మొదటి విడతలో 19 మంది రైతులకు కార్డులు మంజూరు చేశారు. రెండో విడతగా 29 మందికి కార్డులను గత నెలలో అందించారు. సాయంత్రం వ్యాపారం సరిగ్గా సాగకపోవడంతో వారిలో సగం మంది రైతులు కూడా బజార్‌లో వ్యాపారం చేసుకునేందుకు రావడం లేదు. దీంతో స్టాళ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ఉదయం బజారు కోసం ఎదురుచూపులు

రైతులకు ఏళ్ల తరబడి జంబ్లింగ్ లేకపోవడంతో రైతుబజారులోని సాయంత్రం రైతులు నష్టాలు చవిచూడాల్సిన దుస్థితి నెలకొంది. జంబ్లింగ్ పద్ధతిలో తమకు ఉదయం బజారుకు అవకాశం కల్పించాలని సాయంత్రం రైతులు ఇప్పటికే మార్కెటింగ్ శాఖ ఏడీకి వినతి పత్రాలు అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు ఉదయం బజారుకు అవకాశం కల్పిస్తారని రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

పంట పెట్టుబడి రావడం లేదు



పెదవాల్తేరు సాయంత్రం బజారులో సరైన వ్యాపారం జరగక కూరగాయల పంటకు పెట్టిన పెట్టుబడి కూడ రావడం లేదు. మాకు రైతుబజారులో కార్డులు వచ్చాయని ఆనందపడాలో లేక వ్యాపారం జరగడం లేదని బాధపడాలో అర్థం కావడం లేదు.

– అచ్చియ్యమ్మ, రైతు, కె.కోడూరు

జంబ్లింగ్ చేయాలి



రైతుబజారులో రైతులను రోజు తప్ప రోజు జంబ్లింగ్ చేయాలి. అప్పుడే మా పంటను అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఒక రోజు సాయంత్రం వ్యాపారం లేకపోయినా మరుసటి రోజు ఉదయం బజారులో మా కూరగాయలను అమ్ముకునే అవకాశం ఉంటుంది.

– సన్యాసమ్మ, రైతు, దేవరాపల్లి

అధికారులు పట్టించుకోవాలి



సాయంత్రం బజారులో వ్యాపారం సరిగ్గా లేక కార్డులు పొందిన చాలా మంది రైతులు రావడం లేదు. సాయంత్రం రద్దీగా ఉండే బజారులో కానీ, ఇదే బజారులో ఉదయం అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులను కోరాం. అధికారులు మా బాధను అర్థం చేసుకుని సరైన మార్గం చూపాలి. – చెల్లియ్యమ్మ, రైతు, కె.కోటపాడు

పెయింటింగ్ పోటీల్లో కృష్ణా కళాశాల విద్యార్థిని సత్తా



స్రవంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్–24 పోటీల్లో డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ థర్డ్ ఇయర్ విద్యార్థిని ఎ.స్రవంతి సత్తా చాటింది. పెయింటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో స్రవంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, ఎం.శ్రీనివాస ప్రసాద్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనందుకు సత్కరించారు.

గోకుల్ పార్క్‌లో ద్వాదశలింగ రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

ఏయూక్యాంపస్: కార్తీక మాసోత్సవంలో భాగంగా బీచ్ రోడ్డులోని గోకుల్ పార్క్ ఆవరణలో శుక్రవారం ద్వాదశలింగ శత రుద్రాభిషేకం నిర్వహించారు. మూడు రోజులుగా గోకుల్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు బొట్ట వెంకటరమణ, జయశ్రీ దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం మహాపూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు, అలిసి అప్పలనాయుడు, గుమ్మిడి నరసింగరావు, నక్కా కనకరాజు, గుండుబోయిన రవి కుమార్, గుండుబోయిన అప్పలరాజు, మెల్లి అప్పారావు, పల్లా దుర్గారావు, చెట్టి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూలో లవ్ బర్డ్స్ గూళ్ల ఆధునికీకరణ



లవ్ బర్డ్స్ ఎన్‌క్లోజర్‌లో జరుగుతున్న పనులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులోని పక్షుల గూళ్లను అధికారులు ఆధునికీకరిస్తున్నారు. ఎన్‌క్లోజర్లలో పాత గూళ్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. జూ కొలనుకు సమీపంలో ఉన్న లవ్ బర్డ్స్ జోన్‌లో మైనాలు, రామచిలుకలుతోపాటు వివిధ రకాల పక్షులున్నాయి. జూ ప్రారంభంలో ఇక్కడ ఉన్న గూళ్లు కొన్నిచోట్ల శిథిలమయ్యాయి. జూ అధికారులు ఇటీవల వాటిని తొలగించారు. వాటి స్థానంలో కొత్త గూళ్లు నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న సన్నని ఇనుప తీగలు కలిగిన మెస్‌కు బదులుగా అద్దాలు అమర్చుతున్నారు. లోపల ఉండే పక్షులకు గాలి, వెలుతురు ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. అద్దాల లోపల ఉండే పక్షులను సందర్శకులు చూడడానికి వీలుగా వాటిని సిద్ధం చేస్తున్నారు. ఈ జోన్‌లో ఇప్పటికే కొన్ని గూళ్లు సిద్ధం కాగా.. మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.

చెన్నై విద్యార్థుల సందడి



బయోడైవర్సిటీ పార్క్‌లో చెన్నైకు చెందిన స్కూల్ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: చెన్నైకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి వారికి వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యత, విశేషాలను వివరించారు. విద్యార్థులంతా పార్క్‌లో సందడిగా గడిపారు. స్కూల్ గైడ్ రుచి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్ఐ కె.ధర్మారావు, ఆర్ఎస్ఐ ఎస్.మురళీకృష్ణ, ఏఆర్ ఎస్ఐ (వీఆర్) కె.గురయ్యబాబు, హెచ్‌సీ ఆర్.ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని కుటుంబ సభ్యులతో సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు. సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారుల సమక్షంలో సన్మానించారు.


అమ్మ సెంటిమెంట్‌తో విజయం సాధించాం



మాట్లాడుతున్న సినీ హీరో అశోక్

ఎంవీపీకాలనీ: అమ్మ సెంటిమెంట్‌తోనే దేవకీ నందన వాసుదేవ చిత్రం విజయం సాధించిందని ఆ సినిమా హీరో గల్లా అశోక్ అన్నారు. ఈ చిత్ర బృందం శుక్రవారం విశాఖలో పర్యటించింది. ఈ సందర్భంగా గాదిరాజు ప్యాలెస్‌లో హీరో అశోక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు మంచి ఆదరణ లభించిందన్నారు. తొలిరోజు ప్రేక్షకుల టాక్‌తో కొంత నిరాశ చెందినప్పటికీ దర్శకుడు అర్జున్ విశ్వసించిన విధంగా తర్వాత కలెక్షన్లు ఊపందుకున్నట్లు చెప్పారు. చిత్ర దర్శకుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కిన్నెర్ థియేటర్‌లో చిత్రబృందం ప్రేక్షకులతో ముచ్చటించింది.

అలరిస్తున్న జిరాఫీలు



ఇందిరాగాంధీ జూ పార్కులో జిరాఫీలు సందర్శకులను అలరిస్తున్నాయి. జూలో ఒక జత జిరాఫీలున్నాయి. అవి విశాలమైన వాటి ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతూ ఆకట్టుకుంటున్నాయి. కార్తీక మాసం కావడంతో జూ పార్కుకు కొద్ది రోజులుగా సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంది. ఇక్కడ వన్యప్రాణుల్లో జిరాఫీలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. పొడవైన వాటి కాళ్లు, మెడతో అటూ ఇటూ తిరుగుతూ సందడి చేస్తున్నాయి. వీటి ఎన్‌క్లోజర్ జూ ప్రధాన ద్వారం నుంచి లోపల కుడివైపు ఎదురుగా కనిపిస్తుంది. జిరాఫీలు పొడవైన మెడ పైకెత్తి నీవు పొడవా, నేను పొడవా అన్నట్లు సందర్శకులకు వాటి ఎత్తును చూపిస్తున్నాయి. వేగంగా నడుస్తూ ఎదురెదురుగా వెళ్తూ ఒకదానికొకటి ముద్దుపెట్టుకుంటున్నట్లు తలలు ఆనించుకొని సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. దీంతో సందర్శకులు జిరాఫీల ఎన్‌క్లోజర్ వద్దే ఎక్కువ సమయం గడుపుతున్నారు.

– ఆరిలోవ

ఫార్మసీ కళాశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు



ఏయూ వీసీ శశిభూషణరావుతో ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలను శుక్రవారం 1974–78 బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు కళాశాలలోని పూర్వ, నూతన భవంతిలో అన్ని తరగతి గదులు, ప్రయోగశాలలను వీక్షించారు. సెకండియర్ చదువుతున్న బి.ఫార్మసీ విద్యార్థులతో సంభాషించారు. పూర్వ విద్యార్థుల్లో కె.రామయ్య, ఎస్.కృష్ణంరాజు ఫార్మసీ పాత భవనం మొత్తం 1వ అంతస్తు పునరుద్ధరణకు స్పాన్సర్ చేశారు. ఇప్పటికే కె.రామయ్య సహకారంతో 1వ అంతస్తులోని గ్యాలరీ పునరుద్ధరణ పూర్తయింది. ఫార్మసీ కళాశాల పాత బ్లాక్ పునరుద్ధరణకు సహకరించాలని ఇతర పూర్వ విద్యార్థులు ఆసక్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులను పూర్వ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీ మాట్లాడుతూ ఏయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కలసిరావాలన్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్ వీసీ శశిభూషణరావుకు ఫార్మసీ కళాశాల పునరుద్ధరణ పనుల గురించి వివరించారు. ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో 'విద్యార్థి ఫెస్ట్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఎస్ఎఫ్ఐ సభ్యులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 10, 11 తేదీల్లో నిర్వహించబోయే విద్యార్థి సాంస్కృతిక కళా ప్రదర్శనల పోస్టర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. 'విద్యార్థి ఫెస్ట్' పేరిట దీనిని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హర్షిత్, వెంకటరమణ తెలిపారు. ఏయూ వీసీ మాట్లాడుతూ విద్యార్థుల కళా ప్రతిభను ప్రదర్శించడానికి ఇదో మంచి వేదికగా నిలుస్తుందన్నారు. సాంస్కృతిక రంగంలో ఆసక్తి గల విద్యార్థులు ఈ వేదికలో పాల్గొని తమ ప్రతిభను పరిచయం చేసుకోవాలని సూచించారు. కళ, సంగీతం, నృత్యం, వక్తృత్వం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా తమ కళాత్మక పటిమను పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఆంధ్ర విశ్వవిద్యాలయ కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించి, వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా మద్దతు ఇవ్వాలని భావిస్తోందని కమిటీ బాధ్యులు వెంకటరమణ, హర్షిత్ తెలిపారు. కార్యక్రమంలో ఏయూ ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు

ఆరిలోవ: పర్యావరణ పరిరక్షణపై యువతకు అవగాహన అవసరమని సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అండ్ సర్క్యులర్ ఎకానమీ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సాధన్ కుమార్ ఘోష్ అన్నారు. ఎస్‌డబ్ల్యూఎంఏడబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో ఆయన బృందం శుక్రవారం విశాఖ వ్యాలీ స్కూల్‌ను సందర్శించింది. సహజ వనరులను వెలికి తీయడం, వ్యర్థాల నిర్వహణ అవసరంపై కార్యక్రమం నగరంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టారు. సభ్యులంతా చేతులు కలిపి వ్యర్థాల నిర్వహణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సాధన్ కుమార్ మాట్లాడుతూ కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ఈ సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహజ వనరులను వెలికి తీసే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందన్నారు. వ్యర్థాల నిర్వహణ బాధ్యతను యువత అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ హాకీ పోటీలకు ఏయూ జట్టు ఎంపిక



సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి హాకీ గ్రౌండ్‌లో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక శుక్రవారం జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీ తరపున పురుషుల హాకీ జట్టును ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహించారు. ఎంపికైన టీం వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకు చెన్నైలోని ఎంఆర్‌కే స్టేడియంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ మెన్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంది. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఎస్.విజయ్‌మోహన్, వర్సిటీ ప్రధాన కార్యాలయం ఫిజికల్ ఆధికారి డాక్టర్ పల్లవి, జిల్లా విశ్రాంత స్పోర్ట్స్ అధికారి ఎస్.సూర్యారావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కపల్లిలో జరిగిన పోటీల్లో ప్రతిభకనపరిచిన వారిని చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, తాతాజీ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణకు చర్యలు



వీఎంఆర్‌డీఏ పార్క్‌లో సమస్యలు పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి

ఏయూక్యాంపస్: వీఎంఆర్‌డీఏ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ఆయన వీఎంఆర్‌డీఏ పార్క్‌ను సందర్శించారు. వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్క్ నిర్వహణపై వాకర్స్ అందించిన సూచనలు స్వీకరించారు. ప్రధానంగా వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయాలని వాకర్స్ కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, డీఎఫ్‌వో శివానీ, ఈఈలు రామరాజు, ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, సత్యనారాయణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


కళాస్రష్ట 'ద్వారం' వయోలిన్‌కు ఏమైంది?



ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహం చేతిలో కనిపించని వయోలిన్ బౌ

ఏయూ క్యాంపస్: వాయులీన వాద్యంతో శాస్త్రీయ సంగీతానికి కళాస్రష్ట ద్వారం వెంకటస్వామి నాయుడు ఎంతో వన్నె తెచ్చారు. విశాఖ సాగర తీరంలో వయోలిన్‌పై వాద్యాలు పలికిస్తున్నట్లుగా ఉండే ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహం దశాబ్దాల కిందట నెలకొల్పారు. ఒక చేతితో వయోలిన్ పట్టుకుని మరో చేతితో కమాన్(వయోలిన్ బౌ)ను కదిలిస్తూ వాద్యాలు పలికిస్తున్నట్టు ఎంతో సహజంగా ఉండేలా ఈ విగ్రహాన్ని తయారు చేసి ఏర్పాటు చేశారు. కాల గమనంలో విగ్రహాల ప్రాముఖ్యత, ప్రాశస్త్యం తెలిపే కార్యక్రమాలు లేక పోవడంతో వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం ద్వారం వెంకటస్వామి నాయుడు చేతిలో వయోలిన్ ఉన్నా.. మరో చేతిలో ఉండాల్సిన వయోలిన్ బౌ మాత్రం మాయమైంది. ఆకతాయిలెవరైనా దీనిని తీసుకెళ్లారా.. లేక కాలగమనంలో శిథిలమైపోయిందా అనేది ఎవ్వరికీ తెలియడం లేదు. అటుగా వెళ్లే సంగీత ప్రియులు ఈ విగ్రహాన్ని చూసి కొంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఖోఖో పోటీల విజేత ఏఎంఏఎల్ కళాశాల



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఏయూ అంతర్ కళాశాలల ఖోఖో పోటీల విజేతగా అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ పోటీలు జరిగాయి. 28 కళాశాలలకు చెందిన 16 జట్లు విజయం కోసం హోరాహోరీగా తలపడగా.. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఏయూ ఖోఖో జట్టు జాతీయస్థాయిలో రాణించాలని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయ మోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల చిత్రకళా నైపుణ్యం



చిత్రకళా రూపాలను తిలకిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు గీసిన చిత్రాలు వారిలో నైపుణ్యతకు అద్దం పట్టాయి. 2024–25 బ్యాచ్ విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు గత నాలుగు నెలల కాలంలో నేర్చుకున్న అంశాలకు చిత్రకళా రూపమిచ్చారు. వీటి అసెస్మెంట్ కోసమని వర్సిటీ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో శుక్రవారం ప్రదర్శనకు ఉంచారు. వీటిని సహచర విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు ఫైన్ ఆర్ట్స్‌లో నైపుణ్యత సాధించేలాతర్ఫీదు ఇస్తున్నామని, దీనిలో భాగంగానే ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి పి.సింహాచలం ఈ సందర్భంగా తెలిపారు.